నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 | VIKARABAD

ఏసీపీ మెడకు
భూ వివాదం

ఓ భూ వివాదం ఏసీపీ మెడకు చుట్టుకుంది. చివరకు ఆయనపై సస్పెన్షన్ వేటుకు దారి తీసింది. తనకు తెలిసిన వ్యక్తి అడిగిన మేరకు అనుమతి లేకుండా మరో వ్యక్తికి సంబంధించిన ఫోన్ లోకేషన్లు సమకూర్చాడు. చివరకు అది గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కిడ్నాప్‌కు దారి తీయడం.. 30 ఎకరాల భూమి చేతులు మారడం.. పోలీసు కేసు.. ఇలా మలుపులు తిరిగి విచారణలో అన్ని విషయాలు బయటపడడంతో ఉన్నతాధికారులు ఆ ఏసీపీని సస్పెండ్ చేశారు.

తలకొండపల్లిలో వ్యక్తిని బెదిరించి 30 ఎకరాల రిజిస్ట్రేషన్

ఏసీపీ ఇచ్చిన లోకేషన్ ఆధారంగానే కిడ్నాప్ జరిగిందని విచారణలో వెల్లడి

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన శ్రీనివాసరాజు, సత్యనారాయణరాజు చాలా ఏండ్లుగా నగరంలోనే ఉంటున్నారు. వీరిద్దరూ కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఈ నేపథ్యంలో వ్యాపార లావాదేవీలకు సంబంధించి మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో తనకు డబ్బులు రావాల్సి ఉన్నందున.. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలో చంద్రధర గ్రామంలో ఉన్న 50 ఎకరాల్లో 30 ఎకరాలను తన పేరిట చేయాలని సత్యనారాయణరాజు, శ్రీనివాసరాజుపై తీవ్రంగా ఒత్తిడి తీసుకురావడం మొదలుపెట్టారు. ఇలా వీరిద్దరి మధ్య చాలాకాలం వివాదం కొనసాగింది. ఈ నేపథ్యంలో కోపంతో సత్యనారాయణరాజు ఎలాగైనా శ్రీనివాసరాజును బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం కిడ్నాప్‌నకు ప్రణాళిక రచించాడు. శ్రీనివాసరాజును కిడ్నాప్ చేయాలని ప్రణాళిక రూపొందించేందుకుగాను ఆయన కదలికలను ఫోన్ లొకేషన్ ద్వారా తెలుసుకోవాలనుకున్నారు. అయితే ఏసీపీ చాంద్‌పాషా కూడా పరిచయం ఉన్న వ్యక్తి కావడంతో ముగ్గురికి మంచి సంబంధాలే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సత్యనారాయణరాజు సైబర్ క్రైం (సీసీఎస్)లో ఏసీపీ సహకారంతో శ్రీనివాసరాజు ఫోన్ లొకేషన్లను తెప్పించుకున్నారు. తెలిసిన వ్యక్తి అడగటంతో ఏసీపీ కూడా అనుమతి లేకుండానే ఎప్పటికప్పుడు లొకేషన్లను సమకూర్చాడు. దీని ఆధారంగా ప్రతిరోజూ ఉదయం శ్రీనివాసరాజు కారులో తన కుమారుడిని పాఠశాల వద్ద దించివేస్తాడని గుర్తించిన సత్యనారాయణ, మరికొందరు కిడ్నాప్ చేసేందుకు అదే సమయం అనువుగా ఉంటుందని భావించారు. ఈ మేరకు 2023, నవంబరు 15వ తేదీన ఉదయం శ్రీనివాసరాజు తన కుమారుడిని పాఠశాలలో దించివేసిన తర్వాత ఉదయం 7.10 గంటల సమయంలో కొండకల్ పరిధిలోని నాగులపల్లి స్టేషన్ వద్ద కారును అటకాయించి, కిడ్నాప్ చేశారు. కిడ్నాప్‌కు గురైన సమయంలోనే శ్రీనివాసరాజు తన భార్యకు ఫోన్ చేసి అరవడం, ఫోన్ కట్ అవడం జరిగింది. కంగారుపడిన ఆమె తిరిగి ఫోన్ చేస్తే స్విచాఫ్‌గా రావడంతో వెంటనే శ్రీనివాసరాజు స్నేహితుడు చీకూరి సుబ్బరాజుకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పారు. ఉదయం 9.15 గంటల ప్రాంతంలో సుబ్బరాజు మోకిల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని వివరించి, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా శ్రీనివాసరాజుకు చంద్రధాని, కొండకల్, శంకర్‌పల్లి, తలకొండపల్లి, ఇప్పాయిపల్లి, కేశంపేట ప్రాంతాల్లో భూములున్నాయని అందులో పేర్కొన్నారు. అంటే భూ వివాదాలకు సంబంధించే ఈ కిడ్నాప్ జరిగిందనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఆ మేరకు మోకిల పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు మొదలుపెట్టారు.

బెదిరించి..కొట్టి.. రిజిస్ట్రేషన్..

సత్యనారాయణరాజు, మరికొందరు కిడ్నాప్ చేసిన శ్రీనివాసరాజును భూమి రిజిస్ట్రేషన్ కోసం బెదిరించడంతో పాటు తీవ్రంగా కొట్టినట్లు బయటపడిన తర్వాత శ్రీనివాసరాజు పోలీసు విచారణలో చెప్పాడు. కిడ్నాప్ చేసి తనను తీవ్రంగా కొట్టి మరుసటి రోజే బలవంతంగా తలకొండపల్లి తాసిల్దార్ ముందు తీసుకుపోయి 30 ఎకరాల భూమిని సత్యనారాయణరాజు తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లుగా విచారణలో వెల్లడించారు. అయితే 2023, నవంబరు 15న కిడ్నాప్ అయిన మరుసటి రోజే ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. వాస్తవానికి అప్పట్లో తలకొండపల్లి తాసిల్దార్‌గా ఉన్న వెంకట రంగారెడ్డి అసెంబ్లీ ఎన్నికల విధుల్లో భాగంగా కల్వకుర్తిలో పని చేస్తున్నారు. నవంబరు 16వ తేదీన 12 మంది రైతులు భూ కొనుగోళ్లకు స్టాట్లు బుక్ చేసుకోగా... తాసిల్దార్ మాత్రం కల్వకుర్తి నుంచి వచ్చి కేవలం శ్రీనివాసరాజు-సత్యనారాయణరాజుకు సంబంధించి 30 ఎకరాల లావాదేవీని మాత్రమే పూర్తి చేసి, వెళ్లిపోయాడు. ఇందుకోసం సాయి అనే వ్యక్తి ద్వారా తహసీల్దార్‌కు పెద్ద ఎత్తున ముట్టచెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. పైగా శ్రీనివాసరాజు గాయాలతో ఉండడంతో పాటు అతడికి సంబంధించిన పాసుపుస్తకం, ఆధార్, పాన్ కార్డు... ఇవేవీ లేకుండానే రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు పోలీసుల విచారణలో శ్రీనివాసరాజు తెలిపారు.

17 మందిపై కేసు నమోదు

ఈ కిడ్నాప్ వ్యవహారంలో 17 మందిపై కేసు నమోదు చేసిన మోకిల పోలీసులు లోతుగా దర్యాప్తు చేసి, చార్జిషీట్ వేశారు. ముఖ్యంగా ఏ-16గా ఏసీపీ చాంద్‌పాషా, ఏ-17గా తహసీల్దార్ వెంకట రంగారెడ్డిని చేర్చినట్లు తెలిసింది. ఇద్దరు ఉద్యోగుల హస్తం ఇందులో ఉండడంతో ఈ మేరకు మోకిల పోలీసులు రెవెన్యూ, పోలీసు శాఖలకు నివేదికలు ఇచ్చారు. అయితే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మాత్రం తహసీల్దార్ వెంకట రంగారెడ్డిపై బదిలీ వేటు వేశారు. ప్రస్తుతం ఆయన మేడ్చల్ కలెక్టరేట్‌లో యూఎల్‌సీ విభాగంలో పని చేస్తున్నట్లు తెలిసింది.

మరోవైపు పోలీసు శాఖకు వచ్చిన నివేదిక మేరకు చర్యకు చాలాకాలం జాప్యం జరిగినట్లు తెలిసింది. చివరకు కొంతకాలం కిందట ఉన్నతాధికారులు ఏసీపీ చాంద్‌పాషాపై సస్పెన్షన్ వేటు వేశారు.

పూడూరు మండలంలో మైరాన్ హోం రియల్ ఎస్టేట్ సంస్థ లే అవుట్ చేస్తున్న బాధిత రైతుల భూమి

బెదిరిస్తూ..ఆక్రమిస్తూ..

మైరాన్ హోం రియల్ దందాపై స్థానికుల ఆగ్రహం

- పూడూరు మండలంలోని ఎన్కెపల్లిలో రూ. ఐదు కోట్ల విలువైన భూమికి ఎసరు
- మమ్ముళ్ల మత్తులో జోగుతున్న అధికారులు
- మూడున్నర ఎకరాలు ఇతరుల పేరిట డాక్యుమెంట్లు
- న్యాయం చేయాలంటూ జిల్లా ఉన్నతాధికారులకు బాధిత రైతుల ఫిర్యాదు

మైరాన్ సంస్థ భూమిని కబ్జా చేసి లే అవుట్ చేస్తున్నది..

"పూర్వీకుల నుంచి వస్తున్న భూమిని తమకు తెలియకుండా మైరాన్ రియల్ ఎస్టేట్ సంస్థ నిర్వాహకులు కబ్జాచేసి లే అవుట్ చేస్తున్నారు. 115 సర్వే నంబర్‌లో 20 గుంటలు, 117 సర్వేనంబర్‌లో 1 ఎకరా26 గుంటల భూమి ఉన్నది. భర్త అనంతయ్య, మామయ్య లాల య్య గతంలోనే మృతి చెందారు. అప్పట్లో గ్రామ రెవెన్యూ కార్యదర్శిగా (పట్వారీ)గా పని చేసిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ పద్ధతి రాకముందే నవాబులకు నకిలీ డాక్యుమెం ట్ చేసి విక్రయించాడు. తాను కొన్నేండ్లుగా హైదరాబాద్‌కు వలస వెళ్లి కూరగాయలు విక్రయిస్తూ జీవిస్తున్నా. తమ భూమిలో లే అవుట్ చేస్తున్నారని తెలిసి గ్రామానికి వచ్చా. అధికారులు స్పందించి భూములు ఇప్పించాలి."

-జూబ్బూరు నర్సమ్మ, ఎన్కెపల్లి గ్రామం, పూడూరు

వికారాబాద్, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ): రియల్ ఎస్టేట్ సంస్థల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఫామ్‌ల్యాండ్స్ ఏర్పాటు చేసి విక్రయిస్తున్న ఆ సంస్థల నిర్వాహకులు.. వారు కొనుగోలు చేసిన భూమితో పాటు పక్కనున్న భూములనూ కబ్జా చేస్తున్నారు. అంతేకాదు చెరువులు, నాలాలు, అసైన్డ్ భూములనూ వదలడం లేదు. అనుమతుల్లేకుండా లే అవుట్లు చేసి ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టాన్ని కలిగిస్తున్నారు. ఇదంతా సంబంధిత స్థానిక అధికారుల అండదండలతోనే జరుగుతున్నదని స్థానికులు, ప్రజలు మండిపడుతున్నారు. తమ భూములను ఎందుకు కబ్జా చేశారని ప్రశ్నిస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నారని.. రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులకు ప్రతినెలా ముడుపులు అందుతుండడంతో వారికే వత్తాసు పలుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఏదో ఒక చోట రైతులకు అన్యాయం జరిగి జిల్లా ఉన్నతాధికారులను న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తే.. క్షేత్రస్థాయిలో ఆ అధికారులకే విచారణ బాధ్యతలను అప్పగిస్తుండడంతో రైతులకు న్యాయం జరుగడంలేదనే ఆరోపణలూ ఉన్నాయి. కాగా జిల్లాలోని పూడూరు మండలంలోని ఎన్కెపల్లి గ్రామ పరిధిలో వెలిసిన మైరాన్ హోం రియల్ ఎస్టేట్ సంస్థ నిర్వాహకులు కూడా అధికారులతో కుమ్మక్కై తమ భూమిని కాజేశారని ఆరోపిస్తూ పలువురు రైతులు న్యాయం చేయాలంటూ రోడ్డెక్కారు.

జిల్లాలోనే భూముల ధరలు అత్యధికంగా ఉండే పూడూరు మండలంలో ఏకంగా రూ.5 కోట్ల విలువైన భూమిని కబ్జా చేసేందుకు ఓ రియల్ ఎస్టేట్ సంస్థ స్కెచ్ వేసిందనే ఆరోపణలున్నాయి. పూడూరు మండలంలోని ఎన్కెపల్లి గ్రామ పరిధిలో కేవలం ఎనిమిది ఎకరాలతో ప్రారంభమైన మైరాన్ హోం రియల్ ఎస్టేట్ సంస్థ తన వెంచర్‌ను 100 ఎకరాలకుపైగా ఏర్పాటు చేయడమే లక్ష్యంగా భూములను కొంటున్నది. అయితే తమ వెంచర్‌ను విస్తరించే క్రమంలో పక్కనే ఉన్న అమాయక రైతుల భూములను బెదిరించి ఆక్రమిస్తున్నదనే ఆరోపణలున్నాయి. ఈ కబ్జా వ్యవహారాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. ఎన్కెపల్లిలోని సర్వేనంబర్ 115లో మైరాన్ హోం లేఅవుట్‌ను డెవలప్ చేస్తున్నది. అయితే ఈ సర్వేనంబర్‌లో కుంతల భీమయ్య తండ్రి పోచయ్య పేరిట ఉన్న 20 గుంటలు, జూబ్బూరు నర్సమ్మ భర్త అనంతయ్య పేరిట ఉన్న 20 గుంటలు, నల్లోల బుజ్జమ్మ భర్త చంద్రయ్య పేరిట ఉన్న 20 గుంటల భూమిని మైరాన్ హోం సంస్థ కబ్జా చేసిందని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా మన్నెగూడ పెంటయ్య తల్లి చందమ్మ పేరిట ఉన్న 2 ఎకరాలకు సంబంధించి 2001లో ఓఆర్‌సీ వచ్చిందని, 2024 ఫిబ్రవరి వరకు ఆన్‌లైన్‌లో తమ పేరిటే రికార్డులో ఉన్నదని బాధిత రైతు చెప్పాడు. అయితే చంద్రమ్మ భర్త లాలయ్య 1997లో మృతి చెందగా, 1998లో స్థానిక పట్వారీతో కుమ్మక్కై హైమద్ బాబా అనే వ్యక్తి తన కుమార్తెల పేరిట రెండెకరాలను బోగస్ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నాడు. లాలయ్య ఇల్లరికం రావడంతో అతడి పేరిట గుం ట భూమి కూడా లేదని.. అతడి సంతకాలతో బోగస్ డాక్యుమెంట్లు సృష్టించి చంద్ర మ్మ పేరిట ఉన్న రెండెకరాలను ఆ క్రమించారని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా సర్వేనంబర్ 117లో జుబ్బూరు నర్సమ్మకు 1ఎకరా 26 గుంటల భూమి ఉన్నదని.. భర్త, కుమారుడు మృతిచెందడంతో ఆమె ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లగా బోగస్ పత్రాలతో ఎక రం రూ. రెండు కోట్ల వరకు ఉన్న దాదా పు మూడున్నర ఎకరాలను కబ్జా చేశారని.. తమ భూములు తమకు ఇప్పించాలని స్థానిక రెవెన్యూ అధికారులతోపాటు జిల్లా ఉన్నతాధికారుల చుట్టూ బాధితులు ప్రదక్షిణలు చేస్తున్నారు. రియల్టర్లు రైతుల భూముల్లోంచి రోడ్డు వేయడంతోపాటు బెదిరిస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమంగా రికార్డుల నుంచి తొలగించారు

"తన తండ్రి లాలయ్య పేరుతో గుంట భూమి కూడా లేదు. ఆయన 1997 మృతి చెందితే .. కొందరు ఆయన పేరున భూమి ఉన్నట్లు 1998లో రిజిస్ట్రేషన్ చేసినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. లాలయ్య ఇల్లరికం రావడంతో తన తల్లి చంద్రమ్మ పేరున పూర్వీకుల నుంచి వచ్చిన సర్వేనంబర్ 115/6లో ఒక ఎకరా 26 గుంటల భూమి ఉన్నది. 2001లో ఓఆర్‌సీతోపాటు 2024 ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో ఆమె పేరుతోనే ఉన్నది. అనంతరం కొందరు కబ్జాకు పాల్పడి.. అధికారులతో కలిసి ఆన్‌లైన్ రికార్డుల నుంచి ఆమె పేరు ను తొలగించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు డాక్యుమెంట్లు గుర్తించి న్యాయం చేయాలి."

-మన్నెగూడ పెంటయ్య, ఎన్కెపల్లి గ్రామం, పూడూరు

ఎన్కెపల్లి గ్రామ శివారులో లే అవుట్ చేసి రోడ్లు వేస్తూ..

అన్నదాతల బతుకు
రోడ్డు పాలేనా..?

జిల్లాలో ఫోర్త్‌సిటీకి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటు విషయంలో అన్నదాతల ఆక్రందనను ఎవరూ పట్టించుకోవడం లేదు. భూములను పోలీస్ నిఘా మధ్య సేకరించిన అధికారులు ఆయా భూముల్లో ఉన్న పంటల నష్టాలను అంచనా వేసే విషయంలోనూ రైతుల అభిప్రాయాలు తీసుకోవడం లేదు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా భూమిని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం అధికారులు తీసుకుంటున్నారు. కందుకూరు మండలంలోని పంజాగూడ వద్ద ప్రభుత్వం ఫోర్త్‌సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికి రోడ్డు కోసం కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి పంజాగూడ వరకు 300 అడుగుల వెడల్పు రోడ్డు, పంజాగూడ నుంచి ఆకుతోటపల్లి ట్రిపుల్ ఆర్ వరకు 330 అడుగుల రోడ్డు ఏర్పాటుకు నిర్ణయించి భూమిని సేకరించి.. హద్దు రాళ్లు పాతడంతో పాటు నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. ఈ విషయంపై రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేసినా వారి గోడును ఎవరూ పట్టించుకోలేదు.

-రంగారెడ్డి, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ)

- ఫోర్త్‌సిటీకి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు పోలీస్ నిఘాలో భూముల సేకరణ
- పంటల నష్టాల అంచనాలోనూ రైతుల అభిప్రాయాలు తీసుకోని అధికారులు
- పరిహారం చెల్లింపుల్లోనూ నోరు మెదపని ఆఫీసర్లు
- ఆందోళనకు సిద్ధమవుతున్న అన్నదాతలు



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు తీసుకుంటున్న భూముల్లో పంటల వివరాలు సేకరిస్తున్న అధికారులు

పంటల వివరాల సేకరణలోనూ అదేతంతు..

ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకోసం తీసుకుంటున్న భూముల్లో ఉన్న పంటలు, బోర్లు, ఇండ్లు, షెడ్లు తదితర వాటి గుర్తింపు బుధవారం నుంచి ప్రారంభమైనది. రెవెన్యూ, ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారుల సంయుక్తంగా ఈ పనిని ప్రారంభించారు. గుర్తింపులో భాగంగా మొదటిరోజు కొంగరకలాన్ వద్ద రైతులు అడ్డుకున్నా పోలీసుల సహకారంతో వారిని పంపించి పనిని చేపట్టారు. ఫోర్త్‌సిటీకోసం తీసుకుంటున్న వెయ్యి ఎకరాలు పూర్తిగా వ్యవసాయానికి సంబంధించిన భూములే. ఈ భూముల్లో పత్తి, వరి, కూరగాయలు ఇతరత్రా పంటలను సాగు చేసుకుంటూ రైతులు జీవనోపాధి పొందుతున్నారు. అయితే వాటికి పరిహారం ఇచ్చే విషయం లో రైతులను అధికారులు సంప్రదించడం లేదన్న ఆరోపణలున్నాయి.

రూ. కోట్లలో ధరలు.. మార్కెట్ విలువ రూ. లక్షల్లో..

గ్రీన్ ఫీల్డ్ రోడ్డు కోసం ప్రభుత్వం సేకరిస్తున్న భూములు ఎకరానికి రూ. కోటి నుంచి రూ.10 కోట్ల వరకు ఉంటుంది. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్ వంటి మండలాల్లో ఎకరం భూమి రూ. కోటి నుంచి రూ.ఐదు కోట్ల వరకు పలుకుతుండగా.. కొంగరకలాన్ ఓఆర్ఆర్ సమీపంలో ఎకరం రూ. కోటి వరకు బహిరంగ మార్కెట్‌లో ఉన్నది. అయితే ప్రభుత్వ మార్కెట్ ధర మాత్రం రూ. ఐదు నుంచి రూ. పది లక్షల వరకే ఉన్నది. కొంగరకలాన్, ఔటర్‌రింగ్‌రోడ్డు సమీపంలో బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర రూ. పదికోట్లు ఉండగా.. మార్కెట్ ధర రూ. పదిహేను లక్షలే. దీంతో తమకు పరిహారం ఎలా చెల్లిస్తారనే దానిపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. 2013 భూసేకరణ యాక్టు ద్వారా చెల్లిస్తే వారికి తీవ్ర నష్టం కలుగనున్నది. రైతులతో చర్చించి వారి డిమాండ్ మేరకు పరిహారం చెల్లిస్తారా..? అనేది ఇంకా తెలియడం లేదు.

ఆందోళనకు అన్నదాతల సిద్ధం..

ప్రభుత్వం సేకరిస్తున్న భూములకు ఇచ్చే పరిహారంపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో బాధిత రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. పరిహారం విషయం తేల్చకుండానే ప్రభుత్వం భూములు తీసుకోవడం తగదని.. అలాగే, ఆయా భూముల్లో పంటలు, ఇతరత్రా భవనాలకూ పరిహారం నిర్ణయించడం విషయంలోనూ రైతులను సంప్రదించటం లేదని మండిపడుతున్నారు.

సేకరిస్తున్న భూముల వివరాలు ఇలా..

గ్రామం	ఎకరాలు	రైతులు
కొంగరకలాన్	55.5	361
కొంగరకుర్దు	53.2	278
పంజాగూడ	18.33	81
గుమ్మడవెల్లి	32.19	రిజర్వు ఫారెస్టు
రాచులూరు	87.22	351
తిమ్మాపూర్	47.0	290
లేమూరు	84.28	497
ఫిరోజ్‌గూడ	1.3	84

అలాగే, కడ్తాల్ మండలం లోని సాజిబంతండా, ఆమనగల్లులోమచ్చుట్టతండా, ఆకుతోటపల్లి గ్రామాల్లోనూ భూసేకరణ జరుగుతున్నది.

నష్టపోనున్న రైతులు 4,725 మంది..

ఫోర్త్‌సిటీకోసం ప్రభుత్వం జిల్లాలో 421 కిలోమీటర్ల మేర రోడ్డు వేయనున్నది. ఇందుకోసం 1,008 ఎకరాలను సేకరిస్తుండడంతో 4,725 మంది రైతులు తమ భూములను కోల్పోవల్సి వస్తున్నది. ఇందులో మొ దటి విడతలో కొంగరకలాన్ నుంచి పంజాగూడ వరకు 21 కిలోమీటర్లు 300 అడుగుల వెడల్పుతో తీసుకుంటున్నారు. దీని కోసం 448 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. అలాగే, పంజాగూడ నుంచి ఆకుతోటపల్లి వరకు 21 కిలోమీటర్లు 330 అడుగులకు 554 ఎకరాలను సేకరించింది.

పోలీస్ బందోబస్తు మధ్య

సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, చిత్రంలో పక్కన క్యామ మల్లేశ్

రాష్ట్రంలో రాక్షస పాలన

బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల, ఫిబ్రవరి 6 : రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతున్నదని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం పార్టీ మండలాధ్యక్షుడు చీరాల రమేశ్ అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలను ప్రభుత్వానికి విన్నవించాలంటే పోలీసులతో అరెస్టు చేయించడమే కాకుండా రైతులపై దాడులూ చేస్తున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 15 ఏండ్లుగా తాను చేసిన అభివృద్ధి పనులనే నేడు కాంగ్రెస్ ఎమ్మెల్యే రంగారెడ్డి శిలాఫలకాల పేరుతో మళ్లీ ప్రారంభిస్తున్నారన్నారు. మంచాల మండలంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయో కూడా ఆయనకు తెలియవని, ఇప్పటివరకు ఒక్క రూపాయి విదల్చలేదని ఎద్దేవా చేశారు. ఈ నెల 10లోపు గ్రామస్థాయిలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలను పూర్తి చేసుకోవాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. గతంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా అందించేవారమని, కానీ, నేడు కాంగ్రెస్ నాయకులు చెక్కుల పేరుతో గ్రామాల్లో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. రైతాంగాన్ని మోసం చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందని ఎద్దేవా చేశారు. హామీల అమల్లో పూర్తిగా విఫలమయ్యారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పనిచేసే నాయకుడిని ఎవరూ మరిచిపోలేదని, ఏ గ్రామానికెళ్లినా ప్రజలు ఆప్యాయంగా పలుకరిస్తున్నారని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే బాగుండే అని చెప్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. 14 నెలల పాలనలో కాంగ్రెస్ ప్ర జలకు తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రతి కార్యకర్త సిద్ధ మై బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మా ర్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహుదూర్, సహకార సంఘం వైస్ చైర్మన్ యాద య్య, బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, కిషన్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, జానీపాషా, సుకన్య, బద్రీనాథ్‌గుప్తా పాల్గొన్నారు.

సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు